క్లుప్తంగా

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన

తాడిమర్రి: ఏకపాదంపల్లిలో ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట రంగారావు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి గ్రామానికి చేరుకుని మహిళా రైతు ఆదెమ్మ పొలంలో మామిడి మొక్కలను నాటుతారన్నారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు. తర్వాత గ్రామంలోని ఏర్పాటు చేసిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొంటారని వివరించారు.

వెల్దుర్తిలో వైద్య శిబిరం



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. నీటిలో దోమలు స్థావరాలను చేసుకుంటాయన్నారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమతెరలు వాడాలని సూచించారు. రాత్రి సమయాల్లో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమకాటు వలన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బైపాస్ రోడ్డులో పక్కకు దూసుకెళ్లిన లారీ

బత్తలపల్లి: బత్తలపల్లి బైపాస్ రోడ్డులో గ్యాస్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన సమాచారం..అనంతపురం నుంచి ధర్మవరానికి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో లారీ బయలుదేరింది. బైపాస్ రోడ్డులోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఇంతలో సమీపంలో వాకింగ్ వెళ్లిన వారితోపాటు ఎంపీటీసీ కోటి నరేష్‌కుమార్ అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. లారీ అదుపుతప్పి బోల్తా పడినా, ఇతర వాహనాలను ఢీ కొని ఉంటే ప్రమాదం చోటు చేసుకునేదని స్థానికులు తెలిపారు.


ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌తో ఆన్‌లైన్ మార్కెటింగ్



విత్తన నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్న దృశ్యం

కదిరి అర్బన్: ఇండి గ్యాప్(ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) సర్టిఫికేషన్‌తో వ్యవసాయ ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తారని కదిరి ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. కదిరి సబ్ డివిజన్‌లో వేరుశనగ సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించిన రైతుల పొలాలను ఆయనతోపాటు ఎక్స్‌టర్నల్ ఇన్‌స్పెక్టర్ డా. రవి, డా కిరణ్మయి సందర్శించారు. మొత్తం 26 మంది రైతుల వేరుశనగ విత్తన నమూనాలను సేకరించారు. ఈ నమూనాల్లో పురుగుల మందులు, రసాయనిక ఎరువులు, అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకునేందుకు బెంగళూరులోని ల్యాబ్‌కు పంపారు. పరీక్షల అనంతరం ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌తో రైతులకు మార్కెట్ ధర కన్నా ఎక్కువగా ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ మేనేజర్స్ ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, టెక్నికల్ అడ్వయిజర్ సుమతి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న సర్పంచ్ నాగలక్ష్మి

పుట్టపర్తి: బుక్కపట్నం పంచాయతీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ రియాజ్(66) విద్యుత్ ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం సర్పంచ్ నాగలక్ష్మి అంత్యక్రియల నిమిత్తం రియాజ్ కుటుంబ సభ్యులకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సాదిక్.బిల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

సిరుల సెరికల్చర్



ఓడీచెరువు వద్ద సాగైన మల్బరీ



పట్టు పురుగుల పెంపకాన్ని చూపుతున్న రైతు కేశవ

- లాభదాయకంగా మల్బరీ సాగు
- తక్కువ నీటితో పంట సాగుచేసుకునే అవకాశం
- పట్టు సాగుపై రైతుల మొగ్గు

నల్లమాడ రీజియన్‌లో మల్బరీ సాగు ఇలా (ఎకరాల్లో)	
మండలం	విస్తీర్ణం
నల్లమాడ	120
ఓడీచెరువు	75
అమడగూరు	150
నల్లచెరువు	50
తనకల్లు	30

పట్టుపరిశ్రమ శాఖ అందించే సాయం	
ఎకరం మొక్కలు నాటడానికి	రూ.18,750
షెడ్డు నిర్మాణానికి - మొదటి రకం	రూ.3,37,500
- రెండవ రకం	రూ.2,43,750
షూట్ నిర్మాణానికి - మొదటి రకం	రూ.34,125
- రెండవ రకం	రూ.19,800
దోమ తెరలు కట్టడానికి	రూ.3,750
కూలింగ్ సిస్టం కోసం	రూ.12,500
ఆసక్తి కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీతో సోలార్ విద్యుత్ ఏర్పాటు	

ఓడీచెరువు: పట్టుపరిశ్రమ రైతులకు సిరులు కురిపిస్తోంది. రాయలసీమ అంటేనే కరువు ప్రాంతంగా పేరు. వేరుశనగ తప్ప వేరే పంట సాగు చేయని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కరువు రైతులకు మల్బరీ సాగు ప్రత్యామ్నాయంగా మారింది. ప్రధానంగా 1970 ప్రాంతాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతులు మల్బరీపైనే ఎక్కువగా ఆధారపడి జీవించేవారంటే ఈ పంట సాగు ఎంత ఆదుకుందో అర్థం చేసుకోవచ్చు. తక్కువ నీటితో పంట సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందే అవకాశం ఉంది.

భారీగా పంట సాగు..

నల్లమాడ రీజియన్(నల్లమాడ, ఓడీచెరువు, తనకల్లు, అమడగూరు, నల్లచెరువు)లో ప్రస్తుతం దాదాపు 450 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఇందులో అధికంగా అమడగూరు ప్రాంతంలో 150 ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. ఒక ఎకరా మల్బరీ సాగువల్ల సంవత్సరానికి ఆరు పంటలు, ప్రతి పంటకు దాదాపుగా రూ.40 వేలు, ఏడాదికి 2.5 లక్షలు ఆదాయం గడించవచ్చు. సెరికల్చర్ డిపార్టుమెంట్ పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన షెడ్డు, షూట్ నిర్మాణానికి అవసరమైన సాయం చేస్తోంది.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



అర్హత కలిగిన ప్రతి రైతుకు (2.5 ఎకరాలకు పైబడి మల్బరీ సాగుచేసిన వారు) పట్టు పరిశ్రమ శాఖ తరఫున షెడ్డు, షూట్ నిర్మాణానికి సబ్సిడీ ఇస్తాం. పట్టు పురుగుల పెంపకంలో చిన్నపాటి మెలకువలు పాటిస్తే మంచి దిగుబడితోపాటు ఆదాయం వస్తుంది.
– మస్తాన్, టీఎస్సీ, నల్లమాడ రీజియన్

మల్బరీ సాగు లాభదాయకం



తక్కువ నీరు, పెట్టుబడితో మల్బరీ సాగు చేయవచ్చు. మిగిలిన వాటితో పోల్చితే పంటకు ఆశించే తెగులు.చీడ తక్కువ. పట్టుపురుగుల పెంపకం సమయంలో 20 రోజుల మినహా ఎక్కువ పని కూడా ఉండదు. రైతులకు మల్బరీ సాగు లాభదాయకం.
– హనుమంతరెడ్డి రైతు, దాదిరెడ్డిపల్లి ఓడీచెరువు మండలం

రీసర్వేలోని సమస్యలు పరిష్కరిస్తాం



రాఘవంపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న సర్వేయర్ జోసెఫ్

బత్తలపల్లి: భూముల రీసర్వేలో ఏవైనా సమస్యలుంటే అర్జీలు ఇస్తే వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. శనివారం చెన్నరాయపట్నం, రాఘవంపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ వరకు గ్రామసభలు ఉంటాయన్నారు. ఆయా గ్రామసభల్లో 48 వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. రీ సర్వే డీఐ మురళి, రీ సర్వే డీటీ షణ్ముఖ కుమార్, సర్వేయర్ జోసెఫ్, వీఆర్‌ఓలు విష్ణువర్ధన్ రెడ్డి, సాకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: భూముల రీ సర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం ఆయన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల రస్తా, గట్లు, కొలతలు, పట్టాదారు పాసుపుస్తకం తదతర సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎన్‌పీకుంట: గూటిబైలు గ్రామంలో రెవెన్యూ అధికారులు శనివారం భూముల రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించి విస్తీర్ణంలో వ్యత్యాసం, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, పేర్లలో తప్పులు, హద్దులు నిర్ణయించడంలో తేడాలు తదితర సమస్యలపై గ్రామస్తులు, రైతులతో ఆరా తీశారు. గ్రామంలో హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. సర్పంచ్ విష్ణుమూర్తి, తహసీల్దార్ నరేంద్రకుమార్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తలుపుల: బండ్లపల్లిలో శనివారం భూ రీసర్వే సమస్యలపై తహసీల్దార్ రెడ్డి శేఖర్ అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా 44 మంది రైతులు తమ సమస్యలపై వినతులు అందించారు. సర్పంచ్ కొండారెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్‌ఓ జనార్దన్, సర్వేయర్ శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

తనకల్లు: ఉస్తినిపల్లిలో శనివారం రెవెన్యూ అధికారులు భూ రీసర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 11మంది రైతులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. రీ సర్వే ఆర్ఐ మల్లికార్జున సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: రీసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని తహసీల్దార్ నటరాజ్ పేర్కొన్నారు. శనివారం తుమ్మల గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రీ సర్వే అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. రీసర్వే డీటీ రమణబాబు, ఆర్ఐ మంజులాదేవి, వీఆర్‌ఓలు లక్ష్మీనరసమ్మ, నారాయణస్వామి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: రీ సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని డీటీ నారాయణస్వామి తెలిపారు. శనివారం శనివారం సీఎస్‌డీటీ మునిస్వామితో కలిసి ఆయన నక్కలగుట్టపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు రీసర్వేపై అభ్యంతరాలకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

‘ఉపాధి హామీ’ని సద్వినియోగం చేసుకోండి



కే. బత్తలపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం



చిన్నచిగుళ్లరేవులో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకట రంగారావు రైతులకు సూచించారు. ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు గ్రామాల్లో శనివారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎం.అగ్రహారంలో రైతు రామనాథ్ పొలం, చిన్నచిగుళ్లరేవులో మహిళా రైతు నారాయణమ్మ పొలంలో పండ్లతోటల పెంపకం కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రంగారావు మాట్లాడుతూ 2024–25 ఉపాధి హామీ కింద కొత్త పనులు మంజూరయ్యాయన్నారు. ఉపాధి హామీ కింద సీసీరోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులం పశువుల షెడ్లు, పండ్ల తోటల పెంపకం, నీటి కుంటల తవ్వకం, పంట కాల్వల పూడిక తీత పనులు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈవోఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఏపీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కే. బత్తలపల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ పోలప్ప భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డునిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీధర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: పంతులచెరువు పంచాయతీలో శనివారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంతులచెరువులో రూ.20 లక్షలు, తూపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు డ్వామా ఏపీడీ రమేష్ బాబు భూమిపూజ నిర్వహించారు. ఏఓ రామక్రిష్ణ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



గాండ్లపెంటలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగేంద్ర

గాండ్లపెంట: గొడవల జోలికెళ్లకుండా సత్ప్రవర్తనతో మెగాలని కదిరి రూరల్ సీఐ నాగేంద్ర రౌడీషీటర్లకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్ఐ కృష్ణవేణితో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో అలజడులు సృష్టించినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. హెచ్‌సీ రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మండలంలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లకు ఎస్ఐ కే నరసింహుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో గొడవల జోలికెళ్లొద్దన్నారు. ప్రశాంతతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐ క్రిష్టారెడ్డి, జమేదార్లు గురప్ప, రవిప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

‘పరిహారం ఇచ్చి ఆదుకోండి’



కుళ్లిన వేరుశనగను మంత్రి సత్యకుమార్‌కు చూపుతున్న రైతు వీరయ్య

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో బోరుబావి కింద సాగు చేసిన వేరుశనగ వర్షానికి కుళ్లిపోయిందని, తనను ఆదుకోవాలని కౌలు రైతు మంత్రికి విన్నవించాడు. శనివారం మండలానికి విచ్చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను బాధిత కౌలు రైతు వీరయ్య, కమతం మోహన్‌తో కలిసి వర్షానికి కుళ్లిన వేరుశనగను మంత్రికి చూపుతూ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట సాగుకు రూ.1.80లక్షలు అప్పు చేసి పంట సాగు చేశానని, తీరా పంట చేతికందే సమయంలో వర్షాలు దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా బత్తలపల్లి, గంటాపురం, రామాపురం, పోట్లమర్రి గ్రామాల్లో వర్షానికి వేరుశనగ పంట తడిసిపోయినట్లు పలువురు రైతులు తెలిపారు.

ధర్మవరంలో దంచికొట్టిన వర్షం



మరువ పారుతున్న గొట్లూరు చెరువు

ధర్మవరం రూరల్: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలలోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. ఇక పైతట్టు కురిసిన వర్షానికి గొట్లూరు చెరువు నిండి మరువ పారుతోంది. అదే విధంగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు చిత్రావతి నది పరవళ్లు తొక్కుతోంది. చిత్రావతి నది ద్వారా వచ్చే నీరంతా ధర్మవరం చెరువులోకి పెద్ద ఎత్తున చేరుతోంది. గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టా నరసింహులు, ఆయకట్టు రైతులు మరువ వద్ద గంగ పూజ నిర్వహించారు.

తాడిమర్రి: తాడిమర్రి, కునుకుంట్ల, మోదుగులకుంట, మద్దులచెర్వు, శివంపల్లి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, నిడిగల్లు తదితర గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మోస్తరు వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా 8.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సౌమ్య తెలిపారు.

రామగిరి: ఇటీవల ఎగువన కురుస్తున్న వర్షాలకు కుంటిమద్ది సమీపంలోగల జనార్దన దీక్షితుల చెరువు శనివారం మరువ పారింది. పెనుబోలు, కలికివాండ్లపల్లి, గంతిమర్రి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

విద్యుత్ పరికరాల చోరీని అరికట్టండి

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న విద్యుత్ పరికరాల చోరీలను అరికట్టాలని మండల విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తూంచర్ల, ముక్తాపురం, దాదులూరు గ్రామాల పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి కాపర్ వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లినట్లు సబ్ ఇంజినీరు జునైద్ బాషా, పలువురు లైన్‌మెన్లు, రైతులు తెలిపారు. గ్రామాల్లో పోలీస్ నిఘాను ఉంచి చోరీలు జరగకుండా అరికట్టాలని కోరారు. విచారణ చేపట్టి గ్రామాల్లో చోరీలు జరగకుండా చూస్తామని ఎస్ఐ ఇషాక్ బాషా హామీ ఇచ్చారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను సిబ్బందికి అందిస్తున్న జడ్జి రాకేష్, న్యాయవాదులు

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణంలో చెత్తాచెదారం తొలగించారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని జడ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామాంజనేయులు శనివారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఏపీఎంపై విచారణ

గాండ్లపెంట: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మహిళా సంఘ సభ్యులతో కలిసి ఏబీ ఏపీఎం ఓబులేసు ఏపీఎం సూర్యనారాయణపై విచారణ చేపట్టారు. ఇటీవల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అయితే సభ్యులు హరిత, శైలజ, రాజేశ్వరి, తస్మియా, రమణమ్మ, సుశీలను సమావేశం నుంచి బయటకు పంపారని, ఏపీఎం తనకు అనుకూలమైన వారిని ఎన్నుకున్నారని వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏబీ ఏపీఎం ఓబులేసు సభ్యులతో వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఏబీ ఏపీఎం తెలిపారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం నిషేధం



ఎనుములపల్లిలో దుకాణదారుడికి జరిమానా విధిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. శనివారం వైద్యాధికారులు, విద్య, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేష్ సర్కిల్, ఎనుములపల్లి, ఉన్నత పాఠశాలలు తదితర చోట్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర చోట్ల పొగా ఉత్పత్తుల విక్రయాలను నిషేధించినట్లు చెప్పారు. పొగాకు ఉత్పత్తుల చట్టం (సీఓటీపీఏ యాక్ట్–2003) ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధిస్తామన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు సిగరెట్, పొగాకు ఉత్పత్తులు అమ్మరాదన్నారు. జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలన్నారు. ఈ సందర్భంగా ఆరు దుకాణాలపై దాడులు నిర్వహించి జరిమానా విధించారు. పొగాకు నియంత్రణ కార్యక్రమ సామాజిక కార్యకర్త త్రిలోక్‌నాథ్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మునిచంద్రిక, హెచ్‌ఎం సుధాకర్, కానిస్టేబుల్ నాగేంద్ర, పీహెచ్‌ఎన్ లలిత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు విరాళం

కదిరి టౌన్: ఓడీచెరువులో ఈనెల 30న జరిగే వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి రూ.10వేల విరాళం అందజేశారు. పట్టణంలో శనివారం తన నివాసలో ఆయన వాల్మీకి సంఘం నాయకులు మనోహర్, కొండప్ప, రామాంజనేయులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి యువ నాయకులు హర్షవర్ధన్, వాల్మీకి సేవా సంఘం జిల్లా ప్రొఫెషనల్ వింగ్ ప్రధాన కార్యదర్శి హరి పాల్గొన్నారు.

ఎస్ఐపై ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి: దురుసుగా వ్యవహరించిన చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణపై జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు మేడాపురం వాసి పసల వంశీ కిరణ్ తెలిపారు. వివరాలు.. మేడాపురానికి చెందిన విక్రమ్, ఆదిశేషయ్యల మధ్య గొడవ జరిగింది. గత నెల 27న చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో విక్రమ్‌తోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. వంశీకిరణ్ తన చిన్నాన్న ఆదిశేషయ్యతో కలసి కేసు విషయమై శనివారం ఎస్ఐను కలిశారు. దీంతో ఎస్ఐ అకారణంగా ఆదిశేషయ్యను దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించారు. ఇదేమిటని ప్రశ్నించిన వంశీ కిరణ్‌ను తిట్టారు. దీంతో ఎస్ఐపై జాతీయ మానవహక్కుల సంఘానికి వంశీ కిరణ్ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐను సంప్రదించగా.. తాను ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదన్నారు. చట్టానికి లోబడే విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు.

రసవత్తరంగా ఆర్డీటీ టోర్నీ

ధర్మవరం రూరల్: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. లీగ్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం పెనుకొండ అండర్–16 బాలికల జట్టు, ధర్మవరం అండర్–16 బాలికల జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ధర్మవరం జట్టు 30 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. తేజు దీపిక 142 రన్నులతో సత్తా చాటింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పెనుకొండ జట్టు 16.4 ఓవర్లలో 41 రన్నులకే ఆలౌట్ అయ్యింది. ధర్మవరం జట్టు 246 పరుగులతో విజయం సాధించిందని కోచ్ రాజశేఖర్ తెలిపారు.

జాబ్‌మేళా



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. రెండు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 59 మంది హాజరుకాగా వారిలో ప్రతిభ ఆధారంగా 32 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, సీడాప్ డీపీటీఎం నారాయణస్వామి సీడాప్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బడన్నపల్లి రహదారిని బాగు చేయించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ధర్మవరం రూరల్: గుంతలు పడిన రహదారిని బాగుచేయించాలని బడన్నపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. శనివారం రైతు సంఘం నాయకులతో కలిసి వారు ఎంపీడీఓ సాయి మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బడన్నపల్లి ఎస్సీ కాలనీ నుంచి అనంతపురం వైపు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉందన్నారు. రహదారి సరిగా లేకపోవడంతో వ్యవసాయ పనులకు వాహనాల్లో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ధర్మవరం రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు



ధర్మవరం రూరల్: ధర్మవరం రూరల్ ఎస్ఐగా పి. శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నరేంద్ర బదిలీపై రొద్దం వెళ్లారు. ఆయన స్థానంలో బత్తలపల్లిలో పనిచేస్తున్న శ్రీనివాసులు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ ప్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచి శాంతి భద్రతలను పరిరక్షిస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికడతానన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎస్ఐకు శుభాకాంక్షలు తెలియజేశారు.

తలుపుల ఎస్ఐగా నరసింహుడు



తలుపుల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా కే నరసింహుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలు గ్రామాల్లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.